వ్యక్తిత్వాన్ని చంపుకుని జీవిస్తున్న అతడు కొడుకు ఆదర్శాన్ని ఎందుకు కాపాడాలనుకున్నాడు?

పల్లేటి బాలాజీ కథ

# ఎక్కడుంది లోపం?

"పెళ్ళిచూపులు!"

"ఈరోజు సాయంకాలం నాకు పెళ్ళిచూపులు!" ఆ తలపే నాకు ఎంతో ఆనందంగా వుంది. ఆఫీసులో సీట్లో కూర్చున్న నాకు ఏ ఫైలు చూడాలన్నా బుద్ధిపుట్టడంలేదు. ఎంత తొందరగా సాయంకాలం అవుతుందా? అనే ఎదురుచూస్తోంది నా మనస్సు. మధ్యాహ్నం వరకూ 'పెళ్ళిచూపుల్లో ఎలా వుండాలి?' అన్న ఆలోచనలోనే గడిపేశాను. ఆ తర్వాత జి.ఎం.గారిదగ్గరకెళ్ళి సాయంకాలం పెళ్ళిచూపుల కార్యక్రమం వుందని చెప్పి పర్మిషన్ తీసుకుని ఇంటిదారి పట్టాను.

ఇంటికి వెళ్ళిన తర్వాత భోజనం చేసి చిన్న కునుకు తీశానో లేదో...

"రేయ్ చిన్నా! లెయ్ రా. తొందరగా రడీ అవ్వు. వర్షం వచ్చేస్తుంది. తొందరగా బయలుదేరి వెళ్దాం రా!" అంటూ నిద్ర లేపేసింది అమ్మ.

నేనెంత పెద్దవాడినైనా అమ్మ దృష్టిలో ఇంకా చిన్నానే!

త్వరత్వరగా రడీ అయ్యి అమ్మా నాన్నలతో కలిసి పెళ్ళిచూపులకు బయలుదేరాము.

"రండి వెంకటపతిగారూ!" అని గేటు దగ్గరే మాకోసం ఎదురుచూస్తున్న నా కాబోయే మామగారు ఎంతో సాదరంగా మా నాన్నతోపాటు మమ్మల్ని లోనికి ఆహ్వానించారు. ఇంటి గుమ్మం దగ్గర నిల్చుని వున్న నా కాబోయే అత్తగారు...

"రండి రాజేశ్వరమ్మ వొదినగారూ!" అంటూ వరసలు కలిపి అమ్మను ఆహ్వానించింది. ఎంతో నీట్‌గా అలంకరించి వున్న



హాల్లో మమ్మల్ని కూర్చోపెట్టారు. క్షణాలమీద మంచి ఫలహారాలు మా ముందుకు వచ్చాయి.

‘‘రేయ్ చిన్నా! పెళ్ళివాళ్ళింట్లో పెట్టిన స్వీట్స్ తొందరపడి తినేస్తావేమో జాగ్రత్త...!’’ అని నాతో చెప్పి...

‘‘ఏమండీ! మీకుకూడా!’’ అని నాన్నగారితో కూడా బయలుదేరేటప్పుడు అమ్మ

హెచ్చరించిన విషయం గుర్తొచ్చింది నాకా స్వీట్స్ అవీ చూసేసరికి.

వియ్యానికెళ్ళిన ఇంట్లో 'కతికితే అతక దన్నది' అమ్మ మూఢాచారం. అందుకనే అమ్మ మళ్ళీ నన్నూ నాన్నన్నూ ఏ ఫలహార మూ ముట్టుకోవద్దని కళ్ళతోనే హెచ్చరించి ంది. నాకు చిన్నప్పటినుంచి అమ్మంటే ఎంతో గౌరవం, భయంకూడా!

మా నాన్నకూడా అమ్మంటే భయపడ తాడనుకోండి.

నాకైతే వాళ్ళు పెట్టిన స్వీట్స్ అవీ తినాలని వున్నా అమ్మకు భయపడి ఊరుకు న్నాను. నాన్నవైపు చూసిన నాకు ఆయన పరిస్థితికూడా అలానే వున్నట్లనిపించింది.

"అన్నయ్యగారూ! ఫలహారాలు తీసుకోం డి" అని ఎంతో మర్యాదగా నాన్నతో చెప్పింది. నా కాబోయే అత్తగారు. నాన్నగా రు ఏమీ జవాబు చెప్పకుండా అమ్మవైపు దీనంగా చూశారు.

"ఫర్వాలేదులే ఒదినా! ముందు అమ్మా యిని పిలిపించండి!" అంటూ అమ్మకూడా వరస కలిపి మాట్లాడి మంచిగా తినే కార్యక్రమానికి గండికొట్టింది.

"సునీ! అత్తమ్మావాళ్ళకు కాఫీలు తీసు కురామ్మా!" అని ఎంతో సౌమ్యంగా కిచెన్‌వై పు చూస్తూ కేకేశారు నాకాబోయే అత్తగారు

"వీళ్ళమ్మాయి పేరు సునీతకదూ? ఇంట్లో సునీ అని పిలుస్తారు కాబోలు. పెళ్ళయిన తరువాత నేనుకూడా ముద్దుగా పిలుచుకునేందుకు సునీ అన్న పేరే బాగుం టుంది" అనుకుని రాబోయే సునీకోసం కళ్ళను ఫుల్‌గా ఫోకస్ చేసి ఎదురు చూడసాగాను.

చిరుమువ్వల సవ్వడి మెల్లగా నా చెవుల కు వినిపించింది. రెండు క్షణాల తర్వాత ట్రేలో కాఫీ కప్పుల్తో హంసలా నడుస్తూ అమ్మ దగ్గర వచ్చి నిలబడింది సునీత.

"అత్తయ్యకు కాఫీ ఇవ్వమ్మా!" సునీత తో చెప్పింది వాళ్ళమ్మ.

మెల్లగా కాఫీ కప్పు అమ్మకు అందించిం ది. తర్వాత నాన్నకు... ఆ తర్వాత నాకు...

కాఫీ కప్పు నోటి దగ్గర పెట్టుకుని సునీత అందాన్ని ఓరకంటితో పరీక్షించసాగా ను.

"కూర్చోమ్మా!" సునీతనుద్దేశించి చెప్పి ంది అమ్మ.

మెల్లగా మా ఎదురుగా వున్న సోఫాలో కూర్చుంది సునీత.

పెద్ద అలంకారం లేకపోయినా ఎంతో అందంగా వుంది సునీత.

ఐదు నిమిషాల తర్వాత... అమ్మ నన్ను కళ్ళతోనే అమ్మాయి నచ్చిందా లేదా? అని అడిగింది.

తలవంచుకుని నచ్చిందన్నట్లు నేనూ సిగ్గుపడుతూ సైగద్వారా తెలిపాను.

ఓరకంగా చెప్పాలంటే సునీత అందం ముందు నేను దిగదుడుపే! అటువంటి నేను ఆమెకు నచ్చానా లేదా? ఆ విషయం గూర్చి ఎవరూ అడగరెందుకు? పెళ్ళిచూ పుల్లో కేవలం మగాడికి నచ్చితే చాలా? ఆడపిల్లకు ఇష్టాయిష్టాలుండవా? లేక వారి ఇష్టాయిష్టాల్తో పనిలేదా? ఈ పెళ్ళిచూపుల వ్యవస్థ ఎప్పుడు మారుతుందో...

"అమ్మాయిని లోపలకు తీసుకెళ్ళండొ దినా!" అన్న అమ్మ మాటల్తో ఆలోచనల్లోంచి బయటపడ్డాను. సునీతను లోపలకు తీసుకెళ్ళారు.

"అన్నయ్యగారూ! మనం ఇక కట్నకానుకల విషయం మాట్లాడుకుందామా?" అని ఎంతో నిర్మొహమాటంగా అడుగుతున్న అమ్మవంక ఎంతో ఆశ్చర్యంగా చూశాను నేను.

"కట్న కానుకల విషయం నేను ముందుగానే చెప్పానుకదమ్మా!" అని ఎంతో వినయంగా సమాధానం చెప్పారు నా కాబోయే మామగారు.

"చెప్పిన వాటిసూర్చే అయితే మాట్లాడుకోవడం ఎందుకూ..." అంటూ దీర్ఘంతీసింది అమ్మ.

"నేను చెప్పినవి పెట్టడమే నాకు తలకు మించిన భారమని నాకు తెలుసు"

"అయినా అమ్మాయి ఎంటెక్ చదివిన అల్లుడితో అదీ సెంట్రల్ గవర్నమెంట్‌లో మేనేజర్ ఉద్యోగం చేస్తున్న అల్లుడితో సుఖంగా వుంటుందని ఎంత భారాన్నికైనా సిద్ధమవుతున్నారు కదన్నయ్యా?" అని ప్రశ్నించింది అమ్మ.


పాపం ఆడపిల్ల తండ్రిగా ఆయనేం సమాధానం చెప్పలేకపోయారు. ఆయన మొహంలో మారుతున్న భావాలు మాత్రం నాకు కొద్దికొద్దిగా అర్థమవ్వసాగాయి.

"ఆడపిల్లకు ఎందుకు తండ్రినయ్యాను రా భగవంతుడా!" అనుకుంటున్నాడు కాబోలు.

"మీరు చెప్పిన పది లక్షల కట్నంతోపాటు అబ్బాయికి మారుతీ డీలక్స్ కారుకూడా కొనివ్వండి" అని ఎంతో నిర్మొహమాటంగా అడిగింది అమ్మ.

ఆయన అవి కొనివ్వడం నావల్లకాదు అని ఖచ్చితంగా చెప్తే ఈ సంబంధం ఎక్కడ తప్పిపోతుందో అని కాబోలు నీళ్ళు నములుతూ దీనంగా మొహం పెట్టాడు.

నాన్నగారు మాత్రం నోరు మెదపకుం



డా అమ్మ ప్రక్కన కూర్చుని వున్నారు.

అమ్మవైపు చూసిన నాకు మూడు నెలల క్రితం మహిళామండలి ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిచినప్పుడు జరిగిన అభినందన సభలో...

"సభ్యులారా! మన మహిళా మండలికి ఎంతో గొప్ప పేరుంది. ఆ పేరుని ఇనుమడింపజేయాలని నన్ను మీరు అధ్యక్షురాలి పదవికి అత్యధిక మెజార్టీతో ఎన్నుకున్నారు. కేవలం మన సభ్యుల సమస్యలేకాకుండా మన చుట్టుప్రక్కల ఎవరు ఎలాంటి బాధలు పడుతున్నా మనం వారిని ఆదుకుందాం, సహాయం చేద్దాం. అందుకు నాకు మీ అందరి సహాయ సహకారాలు కావాలి. ముఖ్యంగా నేను చెప్పేదేమిటంటే పెళ్ళికాని యువతులెందరో వరకట్నపు విషనాగు కోరలకు ఘోరంగా బలవుతున్నారు. మనందరం కలిసి ఎంతో పకడ్బందీగా వరకట్న వ్యతిరేక ఉద్యమం నిర్వహించాలి. వరకట్నం హక్కులా డిమాండ్ చేస్తున్న యువకుల్ని జైల్లోకి నెట్టించి బుద్ధిచెప్పాలి..." అని ఎంతో ఆవేశపూరితంగా వరకట్నం ఎలా రూపుమాపాలి అనే దాన్నిగూర్చి ఎంతో గొప్పగా ప్రసంగించింది అమ్మ.

అమ్మ ప్రసంగానికి సభ్యుల హర్షధ్వానాలు మిన్నుముట్టాయారోజు.

అలాంటి అమ్మ ఈరోజు చేపల మార్కెట్లో చేపల్ని బేరం చేసినట్లు కట్నం బేరం చేయడం నాకెంతో అసహ్యం వేసింది.

"అన్నయ్యగారూ! మీరు పెడతానన్న దానిమీద నేనేం ఎక్కువ అడిగాను చెప్పండి! మహా అంటే మారుతీ డీలక్సుకి లక్షన్నర అవుతుందేమో? అంతేగా? అసలు మావాడ్ని ఎంటెక్ చదివించేందుకు మేం ఎంత డబ్బు మంచినీళ్ళలా ఖర్చుచేశామో తెలుసా?" అన్న అమ్మవైపు చూసి...

"అమ్మా! నా చదువుకి మీరేం ఖర్చుపెట్టారు? ప్రతి క్లాసులోనూ ఫస్టు రాంకుతో పాస్ అవుతూ స్కాలర్‌షిప్పుల్తో అంటే ప్రభుత్వ డబ్బుతో నేను ఎంటెక్‌వరకూ చదివానన్న నిజం నీకు తెలిసికూడా ఎందుకమ్మా అలా మాట్లాడుతావు?" అని ఎంతో బాధగా మనస్సులో అనుకున్నాను.

"చెల్లమ్మా! కారుకి సగం డబ్బు ఇస్తానమ్మా. మిగిలిన సగం కట్నంలోంచి తీసుకోండి" అని మెల్లగా చెప్పారాయన.

"మీరు అనుకోవాలేగానీ మిగతా సగం కూడా మీకో లెక్కకాదు. మళ్ళీ కట్నం డబ్బెందుకు కదిలించడం" అని ఆయన్ని ఇరుకున పెట్టింది అమ్మ.

ఆ క్షణంలో నాకు అమ్మమీద పట్టరాని ఆవేశం వచ్చింది.

"అమ్మా! ఆరోజు మహిళా మండలి మీటింగ్‌లో వరకట్నం ఎలా రూపుమాపాలి అనేదానిమీద ఎంతో అనర్గళంగా ఆవేశపూరితంగా ప్రసంగించిన నువ్వు ఇలా కట్నంకోసం ఎందుకు బేరం చేస్తున్నావమ్మా?" అని ఎంతో తీవ్రస్వరంతో అమ్మను ప్రశ్నించాలనుకున్నాను. కానీ జన్మనిచ్చిన కన్నతల్లి కన్నరుణం తీర్చుకోవాల్సిన నేనే ఆమె పరువు తీయడం సంస్కారంకాదని ఏమీ మాట్లాడలేకపోయాను.

దాదాపు గంటసేపు గోజాడ్డి గోజాడి మారుతీ డీలక్స్ కారు 'కొనిస్తాను' అని చెప్పించుకుని తృప్తిగా పైకి లేచి...

"వెళ్ళొస్తాం అన్నయ్యగారూ!" మంచి రోజు చూసి త్వరలోనే ముహూర్తాలు పెట్టించండి" అని నాన్నతో నాతో కలసి బయటకు వస్తున్న అమ్మవంక అదోరకంగా చూస్తుండిపోయాను. ఇంటికి చేరుకున్న తర్వాతకూడా నా మనస్సు అదోలా తయారైంది. అందుకనే...

"అమ్మా ఎందుకమ్మా పాపం ఆయన్ని అలా లేనిపోని కోర్కెలు కోరి ఇరకాటంలో పెట్టావు?" అని ఎంతో నెమ్మదిగా అడిగాను.

"అయినా అవన్నీ నీకెందుకు చెప్పుబాబూ? ఆ కోర్కెలన్నీ మనం కోరాల్సినవే! పెళ్ళయిన తర్వాత మళ్ళీ మళ్ళీ పెడ్తారా చెప్పు? చిన్నవాడివి నీకు తెలియదురా వెళ్ళు...!" అని ఎంతో తేలిగ్గా కొట్టి పారేసింది.

త్వరత్వరగా రోజులు గడవసాగాయి. అమ్మ అడిగిన అన్ని కోరికలూ తీర్చేందుకు ఒప్పుకున్న సునీత తండ్రి ఊహించనంత తొందరగా ముహూర్తాలు పెట్టించాడు.

పెళ్ళికి మధ్యలో ఒకరోజే గడువు!

నా మనస్సంతా ఎంతో టెన్షన్‌కు లోనైంది.

బహుశా పెళ్ళికి ముందురోజు ప్రతి ఒక్కరికీ ఇలానే వుంటుందేమో?

ఇల్లంతా బంధుమిత్రులతో నిండిపోయి ఎంతో సందడిగా వుంది.

"మన బంధువులంతా కళ్యాణమండపం దగ్గరకు చేరేసరికి కాఫీలతోపాటు స్వీటూ టిఫిన్‌కూడా రెడీ చేసి వుంచమని చెప్పండి" అమ్మ ఎవరిద్వారానో సునీత వాళ్ళకు చెప్పి పంపించడం విన్న నేను...

"అమ్మా ఇదే పెళ్ళి నువ్వు చేయించేపనైతే వచ్చినవాళ్ళకు కనీసం కాఫీకూడా ఇవ్వవేమో?" అనుకున్నాను.

బంధుమిత్రుల కోలాహలంతో కాలం ఎంతో తొందరగా గడిచింది.

కళ్యాణ శుభముహూర్తానికి కేవలం గం



## శోభనం

ఓ పెద్ద మనిషి అతణ్ని సీరియస్‌గా అడిగాడు "ఛీ... సిగ్గులేదూ! శుభంగా ఆ గదిలో శోభనం జరుగుతుంటే చూస్తావే..."

"అది కాదయ్యా బాబూ... నేనే ఆ పెళ్ళికొడుకుని" చెప్పాడా వ్యక్తి — మళ్ళీ తలుపు సందులోంచి చూస్తూ.

—డి.సత్యమూర్తి (వా|| దేవుపల్లి)

ట వ్యవధి మాత్రమే వుంది.

పెళ్ళికి వచ్చిన నా మిత్రులందరూ—

"ఇంకో గంటలో స్వాతంత్ర్యం కోల్పో తావు బ్రదర్!" అని ఒకరు.

"పూర్ ఫెలో!" అని కొందరూ — నా మీద రకరకాల జోకులేయసాగారు.

"పెళ్ళికుమారుడు గార్ని వచ్చి పీటమీద కూర్చోమంటున్నారండీ!" అంటూ వచ్చి నా మిత్రబృందం ముందు నిలబడ్డాడొకడు.

"మిత్రమా! ఇక వెళ్ళు!" నాటక ఫక్కీలో చెప్పాడో మిత్రుడు.

"వెళ్ళు మిత్రమా! తిరిగి వచ్చి మాతో కలవలేని వేస్తమా!" కవితా ధోరణిలో చెప్పాడింకొకడు. మిత్రులు చేస్తున్న రకరకాల కామెంట్ల మధ్య నడుచుకుంటూ వెళ్ళి పెళ్ళిపీటలమీద కూర్చున్నాను. పెళ్ళిపీటల ప్రక్కన కూర్చున్న పురోహితుడు వేదమంత్రాలు శాస్త్రోక్తంగా చదువుతున్నాడు. ఇద్దరు ఆడవాళ్ళు సునీతను నడిపించుకురావడం తలవంచుకునే చూశాను. సునీతను నా ప్రక్కన కూర్చోబెట్టిన తర్వాత ఐదు నిమిషాలు ఏవేవో మంత్రాలు చదివాడు పురోహితుడు. ఆ తర్వాత మాంగల్యాన్ని నా చేతికిచ్చి—

"మాంగల్యధారణ చెయ్యిబాబూ!" అన్నాడు.

వణికే చేతులతో మాంగల్యాన్ని చేతికి తీసుకున్న నేను ఏదో తెలియని తొట్రుపాటుతో సునీత మెళ్ళో మూడు ముళ్ళు వేసి మంగళసూత్రాన్ని బిగించాను.

ఒక్కసారిగా అక్షింతలవర్షం బాజా భజంత్రీల హోరూ కలిపి నన్నూ సునీతనూ ఊపేశాయి.

ఆ క్షణంలో వీడియో కెమెరా దగ్గరమండి స్టిల్ కెమెరావరకూ పెళ్ళి పందిరివైపు ఫోకస్ చేయబడి నిర్విరామంగా పనిచేశాయి.

కొంగులు ముడివేసి వున్నా నన్నూ సునీతను పట్టపగలే అరుంధతిని చూపించడానికి తీసుకెళ్ళాడు పురోహితుడు.

పట్టపగలు అరుంధతి కనిపించదని తెలిసి కూడా 'ఫార్మాలిటీ కాబోలు' అనుకుని ఆయన చెప్పినవైపు చూశాను. ఆకాశంలో అస్తమించేందుకు పరుగులు తీస్తూన్న సూరీడు తప్ప ఏమీ కనిపించలేదు. ఓ గంటసేపు కళ్యాణమండపంలో రకరకాల కార్యక్రమాలు చేసి అత్తారింటికి తీసుకెళ్ళారు. సునీతకు నాకూ మధ్య వున్న ముడివిప్పి చెరో రూమ్‌లోకి తీసుకెళ్ళారు.

ఏదో ఆలోచిస్తూ రూమ్‌లో కూర్చున్న నా దగ్గరకు ఓ అమ్మాయి వచ్చి కాఫీ కప్పు అందించి...

"బావా! పడగ్గది మల్లెపూలతో అలంకరిస్తున్నారు తెలుసా?" అని తుర్రుమంటూ పిట్టలా వెళ్ళిపోయింది.

"బహుశా ఈ అమ్మాయి సునీతకు చెల్లెలు వరసవుతుంది కాబోలు" అనుకుని రాత్రికి జరుగబోయే శోభనాన్ని గూర్చి ఈస్ట్‌మన్ కలర్ కలలు కంటూ వేడికాఫీ మెల్లగా చప్పరించసాగాను.

దాదాపు ఓ గంట తర్వాత అత్తగారు గదిలోకి వచ్చి—

"బాబూ! బాత్రూంలో వేడినీళ్ళు పెట్టున్నాయి. వెళ్ళి స్నానంచేసి ఈ పట్టుపంచె కట్టుకోబాబూ!" అని ఎంతో మర్యాదగా

పట్టుపంచె నా చేతికిచ్చి వెళ్ళింది.

* * *

పాలవంటి తెల్లని పట్టుపంచె కట్టుకుని పాలపొంగులా పొంగుతున్న కోర్కెతో నా శ్రీమతి సునీతకోసం శోభనపు గదిలో ఎదురుచూడసాగాను.

పాలగ్లాసు చేతిలో పట్టుకున్న సునీతను మెల్లగా నడిపించుకుంటూ వచ్చిన ఆడవాళ్ళు ఆమెను గదిలో వదిలి దబుక్కున తలుపువేసుకుని వెళ్ళిపోయారు. తలవంచుకుని నిలబడి వున్న సునీత దగ్గరకు మెల్లగా వెళ్ళి...

"ఇక్కడే నిలబడిపోయావేం రా సునీ...?" తడబాటుని గొంతులోనే అదిమిపెట్టుకుని మెల్లగా పిలిచాను. సునీ తలెత్తి నా వైపోసారి చూసి మెల్లగా మంచంవైపు కదిలింది ఆమె చూపులో...

"నువ్వెవరవు నన్ను పిలిచేందుకు? అసలు నామీద నీకేం హక్కు వుంది? మా నాన్న మీరడిగిన రేటు పెట్టి మిమ్మల్ని నాకు కొనిచ్చాడు" అన్న భావం కనిపించింది నాకు.

అంతే ఆమెతో మాట్లాడాలంటేనే భయంవేసింది నాకు. ఓ గంట తర్వాత మెల్లగా లైటు తీసేశాను.

* * *

రోజురోజుకీ సునీత నన్ను ఎంత డామినేట్ చేస్తున్నా నేనేమీ ఎదురు తిరగలేకపోయాను. ఇంట్లో అందరికీ ఎంతో హడలైన అమ్మను అసలు లెక్కకూడా పెట్టేదికాదు సునీత.

"కోరికోరి, కట్నం కోసం మంచి కోడల్నే తెచ్చుకున్నావు. అనుభవించు!" అని నాన్న ఓరోజు అమ్మని అనడం విన్న నేను... "పాపం అమ్మ!" అనుకున్నాను.

ఒకరోజు ఆఫీసునుండి లేట్‌గా ఇంటికి వచ్చిన నన్ను... "ఏమండీ! ఎందుకింత లేటయింది?" అని ఎంతో సౌమ్యంగానే

## రాజా రాణీ దేవాలయం



ఒరిస్సాలోని కోణార్క్ దేవాలయం శిల్ప కళా ఖండంగా జగద్విఖ్యాతిని పొందింది. ఆ దేవాలయంలోని మూలవిరాట్టు పాదాలమీద, ప్రతి రథ సప్తమినాడు ఉషోదయ సూర్యకిరణాలు పడడం, అక్కడి విశేషం. అంతేగాకుండా ఆలయ కుడ్యాలమీద చెక్కిన శిల్పాలు, స్త్రీ శిల్ప భంగిమలు ఓ విశిష్టతను చేకూర్చాయి. అలాగే భువనేశ్వర్‌కి దగ్గర్లోని రాజా రాణీ దేవాలయంలో మూలవిరాట్టులేదు. 11వ శతాబ్దానికి చెందినదిగా నిరూపించబడిన ఈ దేవాలయపు గోపురం కుడ్యాల మీద చెక్కబడిన స్త్రీ మూర్తులు (నాయకలు) ప్రతి వ్యక్తికీ కనుల విందుచేస్తాయి. ఒరిస్సాను పాలించిన మహారాజుల, సౌందర్యోపాసనకు, ఇవి అద్దం పడతాయి.

—ప్రాతూరి.

ప్రశ్నించింది సునీత.

ఆరోజు ఆఫీసులో మా జి.ఎం.దగ్గర బాగా చివాట్లు తిని వున్న విసుగులో వున్న నన్ను సునీత అలా ప్రశ్నించడం ఎంతో కోపం తెప్పించింది. అంతే...

"ఏం ఎందుకు లేటయ్యానో సంజాయి షీ ఇచ్చుకోవాలా? ఎప్పుడైనా వస్తాను. ఎంత రాత్రయినా వస్తాను. నన్ను అడిగే హక్కు నీకెవడిచ్చాడు?..." అని ఎంతో గట్టిగా సునీతను దబాయించేశాను.

మౌనంగా వెళ్ళిపోయింది సునీత. ఆ తర్వాత...

"ఎందుకలా మాట్లాడానా?" అని ఎంతో బాధపడ్డాను.

ముభావంగానే భోజనాలు ముగించి బెడ్ రూం చేరాను. సునీత వచ్చిన తర్వాత...

"సారీ సునీ!" అన్నాను. ఆమె కనీసం తలెత్తికూడా నావైపు చూడలేదు.

"బహుశా బాగా బాధపడి వుంటుంది కాబోలు" అనుకొని...

సునీ! ఆఫీసులో ఫైల్స్ కొన్ని సరిగా లేవని జియంగారు ఆయన ఇష్టం వచ్చినట్లు చివాట్లు పెట్టారు. ఆ విసుగులో ఏదేదో మాట్లాడేశాను సారీ సునీ!" అని బతిమాలాను.

"తప్పు చేయడం సారీ చెప్పడం... హు... మీ జి.ఎం ఏదో చివాట్లు పెట్టాడని మీరు నన్ను చివాట్లు పెట్టడం ఎంతవరకు సమంజసం? అసలు మీ ఇష్టమొచ్చినట్లు నామీద ఎగిరే హక్కు మీకెవరిచ్చారు? మీకు జీతం ఇచ్చేది గవర్నమెంట్. అయినా మీ జి.ఎం. చివాట్లు పెడితే తలవంచుకువచ్చారు. అసలు మీ జీతం ఎంత? బోడి నాలుగువేలు. మా నాన్న నాకిచ్చిన కట్నం పది లక్షలు. నా పదిలక్షలమీద నెలకు పదివేలు వడ్డీ వస్తుంది. అంటే మీ జీతంకంటే రెండింతలుకంటే ఎక్కువ. గవర్నమెంట్ ఇస్తున్న నాలుగువేలకు మీ జి.ఎం.కు భయపడి నోరుమూసుకుంటున్న మీరు నేను నెలకు పదివేలు తెస్తున్నప్పుడు నేనేమన్నా నోరుమూసుకోవాల్సిందే మీరు. మీరు అరిస్తే నేను తిరగబడడం చేతకాకమాత్రం కాదు. సంస్కారంకొద్దీ ఊరుకున్నాను ఇకముందు ఇలా జరిగితే బాగుండదని గుర్తుంచుకోండి" అని హెచ్చరించినట్లుగా భార్య చెప్తున్నా ఏమీ మాట్లాడకుండా నోరు మూసుకోవలసిన పరిస్థితి ఏర్పడింది నాకు.

"భగవంతుడా! ఈ నా పరిస్థితి నా శత్రువుకి కూడా రానివ్వకు" అని దేవుడ్ని వేడుకున్నానేతప్ప ఏమీ మాట్లాడలేకపోయాను నేను. ఆలోచిస్తూనే నిద్రపోయాను.

రోజులు ఎంతో భారంగా గడుస్తున్నాయి.

సునీత ఇంట్లో అమ్మను మరీ చులకనగా చూడసాగింది. కనీసం భోజనానికి కూడా అమ్మ మాతో కూర్చోకూడదన్న షరతు పెట్టింది సునీత.

"పాపం ఈ వయసులో అమ్మకెన్ని కష్టాలో?" అనుకున్నానే తప్ప సునీతను ఏమీ అడగలేకపోయాను. అడిగినా ఆమె చెప్పే సమాధానం ఏమిటో నాకు తెలుసు.

"అమ్మా! ఇది నీ స్వయంకృతాపరాధమే నమ్మా!" అని ఒక నిట్టూర్పుమాత్రం భారంగా వదిలాను.

తొలికాన్పుకోసం అమ్మగారింటికెళ్ళింది సునీత.

తిరిగి వచ్చేటప్పుడు పండంటి మగబిడ్డను తీసుకువచ్చిన కోడల్ని ఎంతో గౌరవంగా హారతిపట్టి ఆహ్వానించింది అమ్మ. హారతిని కూడా నిర్లక్ష్యంగా స్వీకరించి ఇంట్లోకి అడుగుపెట్టింది.

కాలచక్రం ఎంతో వేగంగా తిరిగింది.

కోడలు సరిగా చూడలేదనే బాధ అమ్మా నాన్నల్ని చనిపోయేంతవరకు బాధించింది.

సునీత ముద్దుమురిపాలతోనే ఎంబిఎ పూర్తిచేసి యూనివర్శిటీ వదిలాడు మా ఏకైక పుత్రుడు కిరణ్.

"చూడండి! మన కిరణ్‌ని సునీతా కెమికల్స్‌కి మేనేజింగ్ డైరెక్టర్‌ని చేసెయ్యండి. వాడేం ఉద్యోగాలు చేసి ఊళ్ళేలక్కరలేదు. మన కెమికల్ కంపెనీ చూసుకుంటే చాలు" అని వా ద గ్గర ఆర్డర్ జారీ చేసింది సునీత.


"పెళ్ళయిన రోజునుంచి ఈ రోజువరకూ ఏ మార్పూ రాలేదు సునీతలో ఒక్క వయసులో తప్ప!" అనుకుని నవ్వుకున్నాను.

"కిరణ్‌ని సునీతాకెమికల్స్ ఎం.డి.ని చేయడంతోపాటు మెల్లగా మిగిలిన కంపెనీల బాధ్యతల్నికూడా అప్పగించేస్తే నేను హాపీగా శేషజీవితం గడిపెయ్యవచ్చు" అనుకున్నాను

రోజులు గడిచేకొద్దీ కిరణ్ సునీతా కెమికల్స్ .ఎం.డిగానే కాకుండా మిగిలిన కంపెనీల బాధ్యతలుకూడా ఎంతో బాధ్యతాయుతంగా నిర్వహించసాగాడు.

ఓరోజు మధ్యాహ్నం ఆఫీసులో వున్న కిరణ్‌ని ఫోన్లో "సాయంకాలం త్వరగా రాబాబూ! పెళ్ళి చూపులకు రాఘవరావుగారింటికి వెళ్ళాలి" అని సునీత చెప్పడం విన్నా నేను...

"రాఘవరావుగారమ్మాయిని మనవాడికి చేసుకోవాలనుకుంటున్న విషయం మాట మాత్రంగా కూడా నాకెందుకు చెప్పలేదు సునీ?" అని ఎంతో నెమ్మదిగా అడిగాను.



''చెప్పకపోవడం పెద్ద నేరం కాదులెండి! అబ్బాయి సాయంకాలం తొందరగా వచ్చేస్తాడు. మీరూ రెడీగా వుండండి వెళ్దాం'' అని మళ్ళీ ఎవరికో ఫోన్ చెయ్యడంతో మునిగిపోయిన సునీతవంక చూస్తూ వుండిపోయాను.

''రండమ్మా!'' అని సునితదగ్గరకొచ్చి ఎంతో గౌరవంగా ఇంట్లోకి ఆహ్వానించాడు రాఘవరావు.

సునీత వెనుకే నేనూ కిరణ్ వెళ్ళిహాల్లో కూర్చున్నాం.

రకరకాల స్వీట్స్తో కూల్ డ్రింక్స్, ఐస్ క్రీంసూ అన్నీ తెచ్చి మాముందుంచారు.

మా కిరణ్ ఐస్క్రీం తీసుకోబోతే... కళ్ళతోనే సునీత తినొద్దని హెచ్చరించడం నేను గమనించాను.

''అమ్మాయిని తొందరగా తీసుకురండి. మళ్ళీ మాకు వేరే ప్రోగ్రాం వుంది'' రాఘవరావుతో చెప్పింది సునీత.

''సావిత్రీ! అమ్మాయిని తీసుకురా!'' అన్నారాయన.

కుందనపు బొమ్మలాంటి కూతుర్ని వెంటబెట్టుకొచ్చి మా ఎదురుగా కూర్చోబెట్టింది రాఘవరావుగారి భార్య.

మావాడికి అమ్మాయి వచ్చినట్లుంది ముసిముసిగా నవ్వుకుంటున్నాడు.

''అమ్మాయిని లోపలకు తీసుకెళ్ళమనండి'' అని రాఘవరావుతో చెప్పి అమ్మాయిని లోపలకు తీసుకెళ్ళిన తర్వాత...

''చూడండి! మనం అనుకున్నట్టుగా మీ రాఘవా కన్స్ట్రక్షన్‌లో సెవెంటీ ఫైవ్ పర్సెంట్ షేర్‌తోపాటు రాఘవాకెమికల్స్ లోకూడా ఫిఫ్టీ పర్సెంట్ షేర్ ఇవ్వండి'' అని అడిగింది సునీత.

రెండు నిమిషాలు ఆలోచించిన రాఘవరావు ఆ షేర్లు రెండో అమ్మాయికోసం వుంచడంవల్ల మొదటి అమ్మాయికి కట్నంగా ఆ షేర్లు ఇవ్వడం కుదరదని వినయంగానే చెప్పినా చాలా ఖచ్చితంగా చెప్పాడు.

''ఇంత ఖచ్చితంగా మాట్లాడే మనుషులతో సంబంధం మాకువద్దు. మీ సంబంధాన్ని తలదన్నే సంబంధాలు బోలెడున్నాయి.'' అనేసి నన్నూ కిరణ్‌ను వెంటబెట్టుకుని విసురుగా వచ్చేసింది సునీత.

పెళ్ళిచూపుల్లో అమ్మాయి కిరణ్‌కి నచ్చింది. అమ్మాయి తండ్రి రాఘవరావు చాలా బాగా నచ్చాడు. ముఖ్యంగా అతని 'డిసిప్లిన్' నాకు బాగా నచ్చింది.

మరునాడు ఉదయం పదకొండున్నర గంటలకల్లా 'సునీత'కు ఒక పెద్ద షాక్... కిరణ్ రాఘవరావుగారి అమ్మాయిని పైసా కట్నం లేకుండా రిజిస్టర్ మ్యారేజ్ చేసుకుని సునీత ముందుకు వచ్చాడు.

అందులో నా ప్రమేయం ఉన్నట్లు మాత్రం సునీతకు తెలియనీలేదు.

ఆ మాత్రం తెగింపు నా పెళ్ళినాడే చేసుంటే నేను సంతపశువులా అమ్ముడుపోయేవాడినికాను... ఆ కారణంగా సునీతముందు కట్టుబానిసలా భయపడుతూ పడి వుండేవాడినీ కాను.

నా జీవితమిలా గడిచిపోయినా నా వారసత్వం నా కొడుకు కిరణ్‌కు రాకుండా వాడో 'మనిషి'లా ప్రవర్తించడం నాకెంతో ఆనందాన్ని కలిగించింది.

*